క్లుప్తంగా

ముందుగానే పాఠ్య పుస్తకాలు సిద్ధం



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ తాతారావు, సిబ్బంది

కపిలేశ్వరపురం: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సిద్ధం చేసింది. పాఠశాలలు తెరవకముందే తొలి విడత పుస్తకాలను మండలానికి చేరవేసింది. పేద, మధ్య తరగతి ప్రజలు చదువుకునే పాఠశాలలను పక్కా ప్రణాళికతో నిర్వహించడంపై ప్రజాసంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాఠశాలల విద్యార్థుల కోసం 1 నుంచి 10వ తరగతి వరకూ 30,261 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా తొలి విడతగా 13,384 పుస్తకాలు చేరాయి. వాటిని త్వరలో పాఠశాలల హెచ్ఎంలకు అందజేసేందుకు చర్యలు చేపట్టనున్నట్టు ఎంఈఓ కె.తాతారావు తెలిపారు.

రైతులకు అండగా ఉంటాను

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు



జెడ్. మేడపాడు వద్ద చంద్రబాబునాయుడు

మండపేట: పంట నష్టపోయిన రైతులకు తాను అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం ఆయన రామచంద్రపురం నుంచి మండపేట, తాపేశ్వరం, జెడ్. మేడపాడు మీదుగా రాజమహేంద్రవరం వైపు వెళ్లారు. జెడ్. మేడపాడు వద్ద ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, పలువురు రైతులు వర్షంతో తడిసిన వరి పనలను చంద్రబాబునాయుడికి చూపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాల్లో వర్షపు నీటిని బయటకు పంపాలి



సుందరపల్లిలో ఉపాధి కూలీలకు సూచనలిస్తున్న పీడీ మధుసూదన్

కె.గంగవరం: పొలాల్లో ఉండిపోయిన వర్షపు నీటిని వెంటనే బయటకు పంపే చర్యలు తీసుకోవాలని ఎన్ఆర్జీఎస్ పీడీ మధుసూదన్ సూచించారు. మండల పరిధిలోని సుందరపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు పంట బోదెలను శుభ్రం చేసి చేలో ఉన్న నీరును బయటకు పంపించే విధంగా పని చేయాలన్నారు. ఇప్పటికే ప్రతి రోజూ గ్రామాల్లో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయని అకాల వర్షాల కారణంగా మొదటిగా ప్రాధాన్యత తీసుకుని పంట బోదెలు, కాలువలను శుభ్రం చేయించాలని ఎన్ఆర్జీఎస్ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఎంపీడీఓ ఎస్. శ్రీనివాసరావు, ఏపీఓ గణపతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ స్టేషన్లలో స్టాల్స్‌కు సీల్డ్ టెండర్ల ఆహ్వానం

రామచంద్రపురం రూరల్: ఆర్టీసీ డిపో పరిధిలోని ద్రాక్షారామ, కె.గంగవరం బస్ స్టేషన్లలో స్టాల్స్, షాపులు, ఖాళీ స్థలాలకు సైకిల్, స్కూటర్ స్టాండ్స్ తదితర వ్యాపారాల నిమిత్తం అనుభవం, ఆసక్తి కలిగిన వ్యాపార సంస్థలు, వ్యాపారస్తుల నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల దరఖాస్తులను ఈ నెల 7 నుంచి 20వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు ద్రాక్షారామ బస్ స్టేషన్, రామచంద్రపురం డిపోలలో పొందవచ్చన్నారు. అమలాపురం డిపోలో 19వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. పూర్తి చేసిన టెండరు ఫారాలు 20న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ద్రాక్షారామ బస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరుస్తామన్నారు. ఏ కారణం చేతనైనా టెండర్లు అంగీకరించడానికి, తిరస్కరించడానికి, లేదా పూర్తిగా రద్దు చేయడానికి ఆర్టీసీకి పూర్తి అధికారం ఉందని తెలిపారు.

నియామకపత్రం అందజేత

మండపేట: మండలంలోని వెలగతోడు అంగన్వాడీ సెంటర్ -1కు హెల్పర్‌గా గ్రామానికి చెందిన సుంకర వీర సుధా లావణ్యకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నియామక పత్రాన్ని అందజేశారు. యువనేత తోట పృథ్వీరాజ్, అంగనవాడీ సూపర్‌వైజర్ జీఎస్ సత్యవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాదే పిడుగురాముడు, ముక్కపాటి కోటేశ్వరరావు, అన్నందేవుల బుజ్జి, అన్నందేవుల నాగేశ్వరరావు, దాసరి కిట్టయ్య, మంకు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృత్యు కుహరాలు ముంచేస్తాయి

- ఈత సరదాతో తల్లిదండ్రులకు కడుపు కోత
- నీట మునిగి ఎందరో విద్యార్థుల మృతి
- వేసవి సెలవుల్లో జాగ్రత్తలు అవసరం



వెదురుమూడి కోరంగి కెనాల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

కపిలేశ్వరపురం: విద్యాలయాలు ఇచ్చిన సెలవులు జీవితం మొత్తానికి సెలవు కాకూడదు. సెలవుల్లో ఈత సరదాతో జల వలయంలో చిక్కుకుని తమ జీవితాలను అర్ధాంతరంగా ముగించుకుంటున్నారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు. విద్యా సంవత్సరం మొత్తంలో అధిక సమయాన్ని విజ్ఞాన సముపార్జనకు కేటాయించిన నేపథ్యంలో మానసిక ఉల్లాసం పొందేందుకు, కుటుంబ సభ్యుల మధ్య సహృదయ వాతావరణంలో జీవించేందుకు సెలవులను సద్వినియోగం చేసుకోవాలి. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, యువకుల జీవన గమనంపై ఈ కథనం...

అనుభవాలనిచ్చిన దుర్ఘటనలు

కె.గంగవరం మండలం కూళ్ల వద్ద ఈ నెల 14న గోదావరి నదిలో స్నానానికి దిగి పామర్రు, వేళంగి గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. మార్చి 6న పడమర ఖండ్రికకు చెందిన పీఈటీ చెరువులో పడి చనిపోయాడు. 2021 జనవరి 27న కపిలేశ్వరపురానికి చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి శ్రీసజన్ గోదావరిలో స్నానానికి దిగి చనిపోయాడు. 2020 సెప్టెంబర్ 9న కేదారిలంక వద్ద గోదావరి నదిలో జారిపడి కొత్తపేటకు చెందిన వలంటీర్ చోడపనీడి వెంకట దుర్గ సాయిలక్ష్మణ్ చనిపోయాడు. ఇలాంటి ఘటనలకు నిర్దిష్టమైన కారణాలేమైనప్పటికీ వారి ప్రాణాలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. నీటి ఆవాసాల్లో సరదాగా ఈత కోసం దిగినా, ప్రమాదవశాత్తూ జారిపడినప్పటికీ ప్రాణాలు హరించిపోతున్నాయి. జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది.

గుంతలు ప్రమాదకరం

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల వెంబడి విస్తారమైన గౌతమి గోదావరి నదీతీరం ఉంది. గ్రామాల్లో పెద్ద పెద్ద చెరువులు సైతం ఉన్నాయి. అవన్నీ విహారాన్ని, విశ్రాంతిని కోరుకునే యువకులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఇసుక తవ్వకాల వల్ల గోదావరి నదిలో లోతైన గుంతలు ఏర్పడతాయి. ఈత కోసం దిగినవారికి ఆ గుంతల్లో కనిపించవు. మునిగిపోయే ప్రమాదం ఉంది. కేదారిలంక పడవ రేవు అత్యంత ప్రమాదకరమైనది. కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల వెంబడి బ్యాంక్ కెనాల్, గోదావరి నదులలో కొందరు జారిపడి మృతి చెందిన ఘటనలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 97 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. నియోజకవర్గాల యువకులు సముద్ర స్నానాలకు వెళ్తుంటారు. అవన్నీ మృత్యు కుహరాలని గమనించాల్సిన అవసరముంది.

సెల్ఫీ కోరికకు కళ్లెం వేయాల్సిందే..

నదిలోకి దిగి సెల్ఫీ తీసుకోవడాన్ని యువకులు ఇష్టపడుతున్నారు. అదే వారి పాలిట యమపాశంగా మారొచ్చు. సెల్ఫీ తీసుకునేందుకంటూ వెనక్కి మళ్లుతూ గల్లంతై కేదారిలంకలో పడవ రేవులో ఒక యువకుడు గతంలో మృతి చెందాడు.

కుటుంబ సభ్యులతో గడపడం మేలు



సెలవులను కుటుంబ సభ్యులతో గడపడం మేలు. విద్యా సంవత్సరమంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు రెండు నెలల పాటు ఉండే సెలవులను కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, స్నేహితులతో గడపడం ద్వారా మానవ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవచ్చు. అప్పటికీ మిగిలిన సమయాన్ని గ్రంథాలయాలను సందర్శించడం మరింత ప్రయోజనాన్ని ఇస్తుంది.

– డీవీ రాఘవులు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు, పడమర ఖండ్రిక

జిల్లా జడ్జిని కలసిన బార్ అసోసియేషన్ కార్యవర్గం



జిల్లా జడ్జి సునీతకు జ్ఞాపిక అందజేస్తున్న కార్యవర్గం

రామచంద్రపురం: స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గం జిల్లా జడ్జి గంధం సునీతను రాజమహేంద్రవరంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా జడ్జి సునీత నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి వీర్రెడ్డి, కోశాధికారి చక్రవర్తి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పృథ్వీ, మహిళా న్యాయవాదుల ప్రతినిధి సత్యవాణి పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో హోమం

కపిలేశ్వరపురం: స్థానిక దుర్గామాత సమేత పార్వతీ పాప వినాశేశ్వర స్వామి, పార్వతీమాత సమేత అగస్త్యేశ్వర స్వామి వార్ల దివ్య కల్యాణ పూజల్లో భాగంగా శుక్రవారం హోమం నిర్వహించారు. యలమంచిలి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పండితులు స్వామివార్లకు అవభృత స్నాన పూజలు చేశారు.

తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు



గొల్లపాలెంలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

కాజులూరు: భారీ వర్షాల కారణంగా నీట తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కాకినాడ ఇన్‌చార్జి ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపాలెం, అర్యావటం, బంధనపూడి తదితర గ్రామాలలో ఆర్డీవో సీతారామారావు పర్యటించి వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను, ధాన్యం రాసులను పరిశీలించారు. గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయిస్తామని రైతులు అధైర్య పడవద్దన్నారు. తడిసిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ తరుగు పెద్ద మొత్తంలో రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కళ్లాల్లో ధాన్యాన్ని అమ్ముకోదలచిన రైతులు సమీప ఆర్‌బీకేలలో సంప్రదిస్తే ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. కరప ఏడీఏ కె.బాబురావు, మండల తహసీల్దారు బి. సాయిసత్యనారాయణ, ఏఓ వి.అశోక్, ఆర్ఐలు కె.సుబ్బారావు, వై.ఏగేశ్వర్రావు, వీఆర్వో ఈశ్వర్రావు పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలించిన డ్వామా పీడీ

రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో తడిసిన ధాన్యపు రాశులను డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ శుక్రవారం పరిశీలించారు. పొలాల్లో తడిసిన ధాన్యం ఆరబెట్టడం, బస్తాలు పట్టడం, రాశులు పోయడం, రైతుల పొలంలో నీటిని బయటకు పోవడానికి మార్గం చేయించడం వంటి పనులను ఉపాధి కూలీలు చేపట్టారు. 192 మందితో ఉపాధి పనులు చేపట్టినట్టు ఎంపీడీవో డి.శ్రీనివాసు తెలిపారు. 587 మంది కూలీలతో కాలువల్లో పూడిక తీత పనులు తొలగించామని ఆయన తెలిపారు. ఉపాధి పనులను డ్వామా పీడీ మదుసూధన్ తనిఖీ చేసి, రైతులతో మాట్లాడారు.

చంద్రబాబు అడుగు పెడితే అంతే..



జగన్నాథగిరిలో వీపీఏకు సూచనలిస్తున్న బుల్లిరాజు

కాజులూరు: చంద్రబాబునాయుడు అడుగు పెడితే ఆ ప్రాంతంలో అతివృష్టి లేదా అనావృష్టి ఏర్పడుతుందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. తన పాలనలో ఏనాడూ రైతుల సంక్షేమం కోసం పాటుపడని ఆయన నేడు రైతులను పరామర్శించడానికి రావడం విడ్డూరంగా ఉందని చెప్పారు. శుక్రవారం మండలంలోని గొల్లపాలెం, అర్యావటం, జగన్నాథగిరి గ్రామాలలో బుల్లిరాజు తదితర నాయకులు పర్యటించి వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. జగన్నాథగిరిలో ఆయన రైతులతో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా జిల్లాలో వరి పంట నష్టం తీవ్రతను మంత్రి వేణుగోపాలకృష్ణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారన్నారు. రైతు పక్షపాతి అయిన సీఎం జగనన్న రైతులను తగిన రీతిలో ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. చంద్రబాబు పాలనలో తుపాన్లు సంభవించిన రెండేళ్లకుగాని నష్టపరిహారాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు అందేవి కావని, అరకొరగా వచ్చే ఆ సహాయాలు సైతం ఆ పార్టీ కార్యకర్తలకే ఇచ్చేవారన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ఏ మొహం పెట్టుకుని రైతుల వద్దకు వస్తున్నారో అర్థం కావటంలేదని ఎద్దేవా చేశారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య మాజీ అధ్యక్షుడు కొఠాని గణేశ్వర్రావు, తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం ఆయన వెంట ఉన్నారు.

కూలి రేట్లు పెంచాలంటూ జట్టు కార్మికుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

మండపేట: రైస్‌మిల్లు కార్మికుల కూలీరేట్లు పెంచాలని రైస్‌మిల్లు జట్టు కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జట్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైస్ మిల్లుల్లో కార్మిక చట్టాల అమలుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుండగా చాలీచాలని వేతనాలతో కార్మికులు తీవ్ర అగచాట్లు పడుతున్నారన్నారు. కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు వెంటపల్లి భీమశంకరం, కొప్పిశెట్టి రాంబాబు, జి సూరిబాబు, చల్ల శ్రీను, మేడపాటి సత్తిబాబు, రాయి రాంబాబు, వట్టికూటి విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఠంలో ఘనంగా వైశాఖ పౌర్ణమి పూజలు

రాయవరం: వైశాఖ పౌర్ణమి పూజలను శుక్రవారం మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుతగా విజయ వేంకటేశ్వరస్వామి వారికి సుప్రభాతసేవ, తులసీదళార్చన, భవానీ శంకర అష్టమ లింగేశ్వర స్వామి వారికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. విజయదుర్గ అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి లలితా సహస్రనామాలు, లలిత, దుర్గ, సరస్వతీ అష్టోత్తరాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పీఠానికి వచ్చిన భక్తులకు పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. పూజల్లో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పి.సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు

ఘనంగా వనువులమ్మతల్లి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కె.గంగవరం: మండల పరిధిలోని సత్యవాడ గ్రామంలో గురువారం రాత్రి వనువులమ్మతల్లి జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారితో పాటు ఆలయాన్ని ఘనంగా అలంకరించారు. బుట్టబొమ్మలు, బ్యాండుమేళాలు, బాణసంచా, గరగనృత్యాలతో జాతరను నిర్వహించారు. జాతర అనంతరం శుక్రవారం కమిటీ సభ్యులు ఆలయం వద్ద తీర్థం ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

రైతులను ఆదుకోవాలి

మండపేట: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దాళ్వా పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో అకాల వర్షాలతో రైతులకు అపార నష్టం వాటిల్లుతోందన్నారు.

'నాడు-నేడు' పనులపై సమీక్ష

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరంలో గల ఎమ్మార్సీలో శుక్రవారం నాడు-నేడు ఫేజ్-1 పనులపై ఎంఈఓ ఎ. నాగరాజు హెచ్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాడు-నేడు పనులు గతంలో కంటే ఇప్పుడు మెరుగైన ఫలితాలు వచ్చేలా చూడాలని సూచించారు. ఇప్పటికే నాడు-నేడు ద్వారా ఫేజ్-1లో పాఠశాలలు అభివృద్ధి చెందాయని వాటికంటే మెరుగ్గా ఫేజ్-2 పనులు ఉండాలన్నారు. ఆదాయ నిర్వహణ విషయంలో శ్రద్ధ వహించి విద్యార్థులకు సౌకర్యవంతమైన పనులు చేయాలన్నారు. హెచ్ఎంలు కేఆర్‌కే ప్రసాద్, ఎం.పుల్లయ్య, డి.శ్రీనివాస్, పాలకొల్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంగరలో వీరభద్రుడి విగ్రహ ప్రతిష్ఠ



వీరభద్రుడి విగ్రహ ప్రతిష్ఠ పూజ చేస్తున్న యర్రా వీరన్నబాబు, పద్మావతి దంపతులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలోని పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలోని జమ్మి చెట్టు వద్ద వీరభద్రుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ పంచాయతీ ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, పద్మావతి దంపతులు ప్రతిష్ఠ పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు జమ్మిచెట్టు వద్ద వివాహాది శుభకార్యాల్లో వీరభద్రుడి బోణం పోసుకుంటారు. జమ్మి చెట్టు వద్ద వీరభద్రుడి సిమెంటు విగ్రహం శిథిల స్థితికి చేరడంతో యర్రా వీరన్నబాబు దంపతులు రాతి విగ్రహాన్ని సమకూర్చి ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ప్రగడ అర్జునరావు పాల్గొన్నారు.